సూర్య www.suryaa.com 19వ వసంతంలోకి.. www.suryaepaper.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4PM www.suryaa.com బుధవారం 18-02-2026 పేజీలు: 02





## చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్

జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. దేశవాళీ రంజీ ట్రోఫీ ఫైనల్లోకి తొలిసారి ప్రవేశించింది. రెండు సార్లు ఛాంపియన్ అయిన బెంగాల్‌పై సెమీస్‌లో ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కళ్యాణిలో జరిగిన రెండో సెమీస్ మ్యాచ్‌లో ఇవాళ రెండో ఇన్నింగ్స్‌లో జమ్మూకశ్మీర్ 126 టార్గెట్‌ను చేజ్ చేసి చరిత్ర సృష్టించింది. దీంతో రంజీ టోర్నమెంట్ చరిత్రలోనే తొలిసారి జమ్మూకశ్మీర్ ఫైనల్లోకి ఎంట్రీ ఇచ్చింది. జమ్మూకశ్మీర్ జట్టు విజయంలో అబ్దుల్ సమద్, అకీబ్ నబీ, వన్షాజ్ శర్మ కీలక పాత్ర పోషించారు. అబ్దుల్ సమ్ తొలి ఇన్నింగ్స్‌లో 82, రెండో ఇన్నింగ్‌లో 30 రన్స్ చేశాడు. నబీ ఈ మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు తీసుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో శర్మ అజేయంగా 43 రన్స్ చేశాడు. హిమాలయ ప్రాంతానికి చెందిన ఓ జట్టు రంజీ ఫైనల్లోకి ప్రవేశించడం ఇదే మొదటిసారి. తొలుత టాస్ గెలిచి జమ్మూకశ్మీర్ ఫీల్డింగ్ ఎంచుకున్నది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బెంగాల్ 328 రన్స్‌కు ఆలౌటైంది. సుదీప్ కుమార్ ఆ ఇన్నింగ్స్‌లో అత్యధికంగా 146 రన్స్ చేశాడు. ఇక జమ్మూకశ్మీర్ తన తొలి ఇన్నింగ్స్‌లో 302 పరుగులకే ఆలౌటైంది. 26 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్ కేవలం 99 పరుగులకే ఆలౌటైంది.



## కునో నేషనల్ పార్కులో మూడు కూనలకు జన్మనిచ్చిన దక్షిణాఫ్రికా చీతా గామిని

మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కు లో 'గామిని' అనే దక్షిణాఫ్రికా చీతా మూడు కూనలకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఎక్స్ వేదికగా తెలిపారు. 2022లో దక్షిణాఫ్రికా నుంచి ఈ గామినిని భారత్‌కు తీసుకొచ్చినట్లు యాదవ్ తెలిపారు. తాజా కూనలతో కలిపి దేశంలో చీతాల సంఖ్య 38కి చేరిందని కేంద్ర మంత్రి చెప్పారు. ప్రతి కూన జననం 'ప్రాజెక్ట్ చీతా'ను బలపరుస్తుందని తెలిపారు. చీతాలకు అనుకూల వాతావరణాన్ని సృష్టించి వాటి వృద్ధికి కృషి చేస్తున్న ఫీల్డ్ సిబ్బంది, వైద్యులను ఆయన అభినందించారు. గామిని మూడు కూనలకు జన్మనివ్వడంపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కూడా హర్షం వ్యక్తంచేశారు. వన్యప్రాణుల సంరక్షణ, జీవవైవిధ్యంలో ఇది దేశానికే చరిత్రాత్మక విజయమని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.



# రెండేళ్లలో స్మార్ట్ సిటీగా నల్లగొండ

రెండు సంవత్సరాల్లోనే నల్లగొండ పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానని, స్మార్ట్ సిటీ అంటే ఎలా ఉంటుందో చూపిస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. రాబోయే పదేళ్లలో నల్లగొండ ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. నల్లగొండలో ఇకపై రౌడీయిజం, గంజాయి వంటి వాటిని ఉక్కు పాదంతో అణచివేస్తానని తెలిపారు. పట్టణాన్ని శాంతి సామరస్యాలకు, ప్రశాంత వాతావరణానికి నిలయంగా తీర్చిదిద్దుతానని, పేదవాడి అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానని చెప్పారు. పట్టణంలో పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. రూ.900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, పట్టణంలోని అంగన్వాడీలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. బొట్టుగూడా పాఠశాల మాదిరిగానే మరికొన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. రూ.20 కోట్లతో న్యాక్ బిల్డింగు నిర్మాణంలో ఉందని, రూ.84 కోట్ల వ్యయంతో నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రం పూర్తయిందని చెప్పారు.

## ఆవులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

కొత్తగూడెం జిల్లా భద్రాచలం చెక్ పోస్ట్ వద్ద గోవులను వధ శాలకు తరలిస్తున్న కంటైనర్ ను పోలీసులు పట్టుకున్నారు. ఈ కంటైనర్ లో సుమారు 70 ఆవులు ఉన్నట్లు తెలుస్తోంది. ఛత్తీస్ ఘడ్ నుంచి భద్రాచలం మీదుగా హైద్రాబాద్ వధశాలలకు ఆవులను తరలిస్తున్నట్లు పోలీసుల విచారణ లో తేలింది. ఆవులు ఎవరి దగ్గర కొన్నారు. ఈ నేరం లో ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది వంటి విషయాలు తెలియాల్సి ఉంది. కాగా పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.


## ప్రభుత్వ విప్ మాజీ పీఏ సతీమణి రోహిణి అనుమానాస్పద మృతి

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యక్తిగత మాజీ కార్యదర్శి వెంగళ దినేష్ సతీమణి రోహిణి (32) బుధవారం అనుమానస్పద మృతి చెందారు. గత 8 సంవత్సరాల క్రితం సిరిసిల్ల జిల్లా కథలాపూర్ మండలానికి చెందిన రోహిణితో దినేష్ కు వివాహమైంది. వీరి దాంపత్య జీవితంలో ఇద్దరు కూతుర్లు కూడా ఉన్నారు. కొంతకాలంగా దినేష్ వేరే ఒకరితో అక్రమ సంబంధం పెట్టుకొని ఇంట్లో భార్యను వేధిస్తూ గొడవలకు దిగుతున్నట్లుగా స్థానికుల ద్వారా తెలిసింది. గొడవలు తీవ్ర స్థాయికి చేరుకోవడంతో ఇటీవలే రెండు మాసాల క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అతనిని పీఏ నుండి తొలగించినట్లు సమాచారం. అయితే వేకువ జామున ఆత్మహత్య పాల్పడిందని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధృవీకరించినట్లు తెలిసింది.

## రీల్స్ కోసం బస్సుల డోర్లు తీస్తూ స్టంట్స్.. సీసీటీవీ ఆధారంగా బైకర్ అరెస్టు



ఢిల్లీలో 22 ఏళ్ల ఓ వ్యక్తి తన బైక్‌తో ప్రమాదకర స్టంట్స్ పర్ఫార్మ్ చేశాడు. మోటార్‌సైకిల్‌పై వెళ్తూ ప్రయాణికుల్ని వేధిస్తున్నాడు. సోషల్ మీడియా రీల్స్ కోసం అతను ఆ డేంజరస్ స్టంట్స్ చేశాడు. రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై రైడ్ చేస్తూ.. ఆటోలు, కార్లు, బస్సులకు చెందిన డోర్లను తీస్తున్నాడు. కదిలే వాహనాలకు చెందిన డోర్లను తీస్తున్న కేసులో నిందితుడు తుషార్ పునియాను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఖాజూరీ ఖాస్ నివాసితుడిగా అతన్ని గుర్తించారు. అయితే ఫిబ్రవరి 16వ తేదీన ఓ బైక్ స్టంట్‌కు చెందిన వీడియో వైరల్ అయ్యింది. ఢిల్లీ ఆర్టీసీకి చెందిన బస్సు డోరును బైక్‌పై వెళ్తూ లాగేశాడు. ఆ ఘటనకు చెందిన వీడియో వైరల్ కావడంతో పోలీసులు కేసును దర్యాప్తు చేశారు. వైరల్ రీల్ ఆధారంగా న్యూ ఉస్మాన్‌పూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడిని గుర్తుపట్టి, పట్టుకునేందుకు ఓ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారి చెప్పారు. సీసీటీవీ ఫూటేజ్ ఆధారంగా బైకర్ వైరల్ వీడియో ప్రదేశాన్ని పరీక్షించారు. ఆ తర్వాత నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. స్టంట్స్ కోసం వాడిన బైక్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్టంట్స్ పర్ఫార్మ్ చేస్తున్న సమయంలో గుర్తు పట్టకుండా ఉండేందుకు నెంబర్ ప్లేట్ తీసివేసినట్లు పోలీసులు చెప్పారు.



## ప్రముఖ నటి ప్రవీణ దేశ్ పాండే కన్నుమూత

బాలీవుడ్ సినీరంగంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నటి ప్రవీణ దేశ్ పాండే మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గత ఐదేళ్లుగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆమె ఆరోగ్యం ఇటీవల మరింత విషమించడంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ వార్తతో సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆమెకు నివాళులు అర్పిస్తున్నారు. రంగస్థల నటనతో తన కెరీర్‌ను ప్రారంభించిన ప్రవీణ దేశ్ పాండే, నాటకాల్లో శిక్షణ పొందుతూ తన నటనా ప్రతిభను మెరుగుపరుచుకున్నారు. అక్కడి నుంచి టెలివిజన్ సీరియల్స్, తర్వాత సినిమాల్లోకి అడుగుపెట్టి వెండితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. హిందీతో పాటు మరాఠీ భాషల్లోనూ ఆమె అనేక పాత్రలు పోషించి ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. ముఖ్యంగా రెడీ చిత్రంలో నటుడు సల్మాన్ ఖాన్తో కలిసి కీలక పాత్ర పోషించడం ద్వారా ఆమెకు విస్తృత గుర్తింపు లభించింది. అలాగే గబ్బర్ ఈజ్ బ్యాక్ సినిమాలోనూ ఆమె నటన ప్రశంసలు అందుకుంది.



## మీనాక్షి న్యూలుక్

చిన్న సినిమాలతో కెరీర్ స్టార్ట్ చేసిన మీనాక్షి చౌదరి తరువాత స్టార్ హీరోల సరసన నటించి స్టార్ లీగ్‌లో ఫ్లాష్ అయ్యారు. సూపర్ స్టార్ సినిమాలో గెస్ట్ రోల్ చేసిన ఈ భామ.. తరువాత వరుసగా సీనియర్ హీరోల సినిమాల్లో నటిస్తున్నారు. ప్రజెంట్ సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్న ఈ భామ, ఫ్యూచర్ ప్రాజెక్ట్స్ విషయంలో తన ప్లానింగ్ ఏంటో రివీల్ చేశారు. చిన్న సినిమాలతో కెరీర్ స్టార్ట్ చేసిన మీనాక్షి చౌదరి... తరువాత వరుస ఆఫర్స్‌తో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా టాప్ హీరోలతో జోడి కడుతూ స్టార్ లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు కష్టపడుతున్నారు. ప్రజెంట్ టాలీవుడ్లో ఫుల్ బిజీగా ఉన్నారు మీనాక్షి చౌదరి. ఆల్రెడీ రవితేజ లాంటి సీనియర్ స్టార్స్‌తో స్క్రీన్ షేర్ చేసుకున్న ఈ బ్యూటీ, వరుసగా సీనియర్ స్టార్స్‌తో సినిమాలు చేస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో వెంకటేష్‌కు జోడీగా బ్లాక్ బస్టర్ అందుకున్నారు.

## రఫేల్ ఫైటర్ జెట్స్‌లో 50% మా దేశీయ పరికరాలు ఉండాలి




సైనిక శక్తిని మరింత బలోపేతం చేసుకోవడం కోసం భారత్ మరో డీల్‌కు సిద్ధమైంది. త్రివిధ దళాల పోరాట సామర్థ్యాన్ని పెంచే దిశగా ఫ్రాన్స్‌తో రఫేల్ యుద్ధ విమానాల డీల్‌ను కుదుర్చుకోనుంది. ఇందుకోసం భారత్, ఫ్రాన్స్ రక్షణమంత్రుల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భారత్‌లో పరికరాల తయారీకే రాజ్‌నాథ్ సింగ్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రఫేల్ ఫైటర్ జెట్‌లలో 50 శాతం దేశీయ తయారీ పరికరాలు ఉండేలా చూడాలని ఫ్రాన్స్‌ను కోరారు. ఆ దేశంతో వ్యూహాత్మక భాగస్వామ్యంలో కో డిజైన్, కో డెవలప్‌మెంట్, కో ప్రొడక్షన్ వంటి అంశాలు చేర్చినట్లు తెలుస్తోంది. రూ.3.25 లక్షల కోట్ల అంచనాతో 114 రఫేల్ యుద్ధవిమానాల సరఫరాకు ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బెంగళూరులో రక్షణ మంత్రుల స్థాయి వార్షిక సమావేశం జరిగింది. భారత్‌లో తయారీ గురించి రాజ్‌నాథ్ సింగ్ చర్చించారు. ఈ డీల్‌లో ఎక్కువగా మేక్ ఇన్ ఇండియా పరికరాలు ఉండాలని, భారతీయ కంపెనీలకు సాంకేతికత బదిలీ వంటి అంశాలపై మాట్లాడినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తదుపరి తరం ఫైటర్ జెట్ ఇంజిన్ తయారీ విషయంలో సాంకేతిక సహకారం కోసం చర్చించినట్లు వెల్లడించాయి.

## నాంపల్లి క్రిమినల్ కోర్టుకు బాంబు బెదిరింపు




నాంపల్లి క్రిమినల్ కోర్టులో బుధవారం ఒక్కసారిగా బాంబు కలకలం రేగింది. కోర్టు భవనంలో బాంబులు పెట్టామని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఏకంగా 12 ఆర్డీఎక్స్‌లతో కోర్టును పేల్చేయబోతున్నామని మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో కోర్టులోని న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ఈ బెదిరింపు నేపథ్యంలో పోలీసులు, భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. కోర్టు భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డాగ్ స్క్వాడ్‌ను, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి తనిఖీలు చేపట్టారు. కోర్టు భవనం మూలమూలలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే ఇది కేవలం ఆకతాయిల పనేనని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




# అనుపమ పరమేశ్వరన్ జోరు

టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా వరకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనుపమ పరమేశ్వరన్ కెరీర్ పరంగా దూసుకుపోతోంది. వరుస విజయాలతో జోరు పెంచిన ఈ బ్యూటీ.. ఫిబ్రవరి 18న తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చింది. Ess Kay Gee ఎంటర్టైన్మెంట్, బెంచ్‌మార్క్ స్టో రీటెల్లర్స్ బ్యానర్లపై వస్తున్న ప్యాన్ ఇండియన్ సినిమాలో హీరోయిన్‌గా ఎంపికైంది అనుపమ. ఈ కొత్త ప్రాజెక్ట్‌తో అనుపమ తన సినిమాల వేగం మరింత పెంచిందని చెప్పొచ్చు. ఒక ఇంటెన్స్ సైకాలజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి ఆర్జే షాన్ దర్శకత్వం వహిస్తున్నారు. విశేషం ఏమిటంటే.. గతంలో అనుపమ, షాన్ కాంబినేషన్‌లో వచ్చిన ఓ షార్ట్ ఫిల్మ్‌కు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై అద్భుతమైన ఆదరణ లభించింది. ఇప్పుడు ఆ విజయవంతమైన జోడీ వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమైంది.



# హార్దిక్ పాండ్యా ఆసక్తికర వ్యాఖ్య

భారత సూపర్‌స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన బ్యాటింగ్‌లో ఇంకా పూర్తి స్థాయిలో తన సామర్థ్యాన్ని చూపించలేకపోయానని ఓ ఇంటర్వ్యూలో స్వయంగా అంగీకరించాడు. గత ఐపీఎల్ 2025 తర్వాత తనకు ఆటపై ఆసక్తి కొంత తగ్గినట్టుగా అనిపించిందని, బ్యాటింగ్‌లో తన పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడం జరగలేదని చెప్పుకొచ్చాడు. ఈ సమయంలో మహికా శర్మతో జరిగిన సంభాషణలు తనకు మానసికంగా ఎంతో సహాయం చేశాయని వెల్లడించడం గమనార్హం. హార్దిక్ మాట్లాడుతూ, ఇప్పటివరకు తాను బ్యాటింగ్‌లో కేవలం 40 శాతం మాత్రమే తన సామర్థ్యాన్ని ఉపయోగించుకున్నానని తెలిపాడు. ఐపీఎల్ 2025 తర్వాత తన ఆటపై సీరియస్‌గా పని చేసినట్లు పేర్కొన్నాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రోజుకు 6 నుంచి 7 గంటల పాటు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశానని తెలిపాడు. తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మ వల్లే మళ్లీ క్రికెట్‌పై ప్రేమ, ఆసక్తి పెరిగిందని చెప్పుకొచ్చాడు. హార్దిక్ పాండ్యా జియోహాట్‌స్టార్‌తో మాట్లాడుతూ, గత ఐపీఎల్ సమయంలో తాను ఉత్సాహం కోల్పోయినట్టు అనిపించిందని తెలిపాడు. "నాలోని చిన్నపిల్లాడు, క్రికెట్ పిచ్చోడు బౌలింగ్‌పై ఎక్కువగా దృష్టి పెట్టాడు. నాకు ఎప్పటినుంచో బౌలింగ్‌పై నమ్మకం ఉంది. కానీ బ్యాటింగ్ నా హృదయానికి దగ్గర ఉంటుంది. గత ఐపీఎల్ తర్వాత నాకు అర్థమైంది.. హార్దిక్ పాండ్యాగా నా పూర్తి సామర్థ్యంతో ఆడాలి. నిజంగా చెప్పాలంటే, ఇప్పటివరకు బ్యాటింగ్‌లో నా సామర్థ్యంలో 40 శాతం కూడా బయటపడలేదు. నేను కలలు కనేది, ప్రాక్టీస్ చేసేది నా ప్రదర్శనలో పూర్తిగా కనిపించలేదు" అని అన్నాడు.



## మాజీ మంత్రి
# అంబటికి బెయిల్

మాజీ మంత్రి అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరైంది. ఆయన మీద ఏపీ పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. జనవరి 31 నుంచి అంబటి జైల్లోనే ఉన్నారు. సత్తెనపల్లిలో చంద్రబాబును దూషించిన కేసులో, పోలీసులతో అనుచితంగా ప్రవర్తించడం, సంక్రాంతి సంబురాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించడం వంటి కేసులు ఆయన మీద నమోదయ్యాయి. అయితే ఇప్పటికే రెండు కేసుల్లో ఆయనకు బెయిల్ మంజూరైంది. సంక్రాంతి సంబురాల సందర్భంగా లక్కీ డ్రా కేసుకు సంబంధించిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని అంబటి గుంటూరు కోర్టును ఆశ్రయించారు. మరోవైపు పోలీసులు ఈ కేసులో అంబటిని విచారించాలంటూ కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం ఈ పిటిషన్ పై విచారణ జరిపిన కోర్టు కస్టడీ పిటిషన్ కొట్టేసి అంబటికి బెయిల్ మంజూరు చేసింది.

# ఏపీ శాసనమండలి రేపటికి వాయిదా




ఏపీ శాసనమండలి రేపటికి వాయిదా పడింది. ఇందాపూర్ డెయిరీపై చర్చించాలంటూ వైసీపీ పట్టుబట్టింది. వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేశారు. దీంతో మండలి చైర్మన్ రేపటికి వాయిదా వేశారు. హెరిటేజ్ సంస్థకు ఇందాపూర్ డెయిరీకి సంబంధాలు ఉన్నాయి. పెద్ద ఎత్తున దోపిడీకి తెరలేపారు. దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు టీడీపీ నేతలు మాట్లాడుతున్నారు. దేవదేవుడు అంటే అందరికీ భక్తి ఉంది. తిరుమల వెంకటేశ్వరస్వామికి అందరికి భక్తి ఉంది. ఇప్పుడు దేవుడి పేరుతో దోపిడీకి తెరలేపారు. 'ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఏం మేలు చేశారు. రైతులు, మహిళలు అందరూ ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు ఫీజు రియింబర్స్‌మెంట్ కోసం చూస్తున్నారు. హామీలు మొత్తం పక్కనపెట్టి.. వాటిని డైవర్షన్ చేసేందుకు కుట్ర పన్నారు.' అంటూ బొత్స పేర్కొన్నారు.



## కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు
# జస్టిస్ సుదర్శన్‌రెడ్డి?

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రాజ్యసభ సభ్యులు కానున్నారా? కాంగ్రెస్ తరపున ఆయనకు అవకాశం లభిస్తుందా? రాష్ట్రంలో ఖాళీ అవుతున్న రెండు స్థానాల్లో ఒకటి ఆయనకు ఇచ్చే అవకాశమున్నదా?.. ఇలాంటి చర్చలు కాంగ్రెస్‌లో ప్రాథమిక స్థాయిలో మొదలయ్యాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూలు ప్రకారం రాష్ట్రంలో ఇద్దరు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ఏప్రిల్‌తో ముగియనున్నది. ఇందులో ఒకటి కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కాగా, మరొకరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కేఆర్ సురేష్ రెడ్డి. ఖాళీ అవుతున్న ఈ రెండు స్థానాలకు మార్చి 16న పోలింగ్ జరగనున్నది. వీరిద్దరి పదవీకాలం ఏప్రిల్ 9న ముగుస్తున్నా ఎన్నికల ప్రక్రియను మాత్రం దాదాపు నెల రోజుల ముందే కంప్లీట్ చేసేలా ఈసీ షెడ్యూలు రూపొందించింది.



## రెండు జిల్లాల సరిహద్దుల్లో
# చిరుత సంచారం

నిజామాబాద్, సిరిసిల్ల సరిహద్దు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తోందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిరికొండకు ఆనుకొని ఉన్న సిరిసిల్ల అటవీ ప్రాంతంలో పులి కదలికలు ఉన్నందున దగ్గర్లోని గ్రామాలకు చెందిన ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సిరికొండ అటవీ రేంజ్ అధికారి నర్సింగరావు సూచించారు. సిరికొండ మండలంలోని తాటిపల్లి, పందిమడుగు గ్రామాల చుట్టూ పులి కదలికలు ఉన్నాయి. పులి గురించి అప్రమత్తం చేయడంతో పాటు అధికారులు ఆయా గ్రామాల్లో అగ్ని ప్రమాదాల నివారణ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ.. ఎక్కడైనా పులి కదలికలు కనిపిస్తే అటవీ అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పారు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించే చర్యలకు పూనుకోవద్దని సూచించారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి గంగారాం శిక్షణ అధికారి కృష్ణ గీత్ సిబ్బంది పాల్గొన్నారు.



# హాట్‌గా దిశా పటాని

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం టాలీవుడ్ వైపే చూస్తుంది. ఎంతో మంది తెలుగులో సినిమాలు చేయడానికి రెడీ అవుతున్నారు. ఇప్పటికే ఇతర భాషల నుంచి వచ్చిన ముద్దుగుమ్మలు తెలుగులో టాప్ హీరోయిన్స్ గా రాణిస్తున్నారు. ముఖ్యంగా కన్నడ నుంచి వచ్చిన ముద్దుగుమ్మలు మన దగ్గర స్టార్ హీరోయిన్స్ అయ్యారు. తెలుగు సినిమాలతోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్నారు. అలాగే బాలీవుడ్ నుంచి కూడా చాలా మంది భామలు వచ్చారు. పైన కనిపిస్తున్న హీరోయిన్ కూడా బాలీవుడ్ నుంచి వచ్చిన మన దగ్గర స్టార్ గా మారింది. చేసింది రెండు సినిమాలే కానీ స్టార్ డమ్ సొంతం చేసుకొని ఎంతో మంచి కుర్రాళ్ళ హాట్ ఫేవరేట్ హీరోయిన్ గా మారిపోయింది. చేసిన రెండు సినిమాల్లో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది.

# బీజేపీ దాదాగిరి వల్లే క్రికెటర్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడం లేదు: సంజయ్ రౌత్



ఇండియా,పాకిస్తాన్ క్రికెటర్లు .. మ్యాచ్ టైంలో పరస్పరం షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడంలేదు. ఆపరేషన్ సింధూర్ తర్వాత ఇరు జట్ల ఆటగాళ్లు ఐసీసీ టోర్నీల్లో తలపడిన సమయంలో కరచాలనం చేసుకునేందుకు నిరాకరిస్తున్నారు. ఈ అంశంపై శివసేన ఎంపీ సంజయ్ రౌత్ స్పందించారు. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం దాదాగిరి చేయడం వల్ల భారత క్రికెటర్లు పాక్ ఆటగాళ్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వడం లేదని రౌత్ ఆరోపించారు. ఆసియాకప్‌లో ఆ తర్వాత గత ఆదివారం వరల్డ్‌కప్‌లో రెండు జట్లు పోటీపడ్డాయి. ఆ సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు హ్యాండ్‌షేక్ ఇచ్చుకోని విషయం తెలిసిందే. పాకిస్థాన్, భారత్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరగాల్సిన అవసరం లేదని సంజయ్ రౌత్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ మీరు ఆడాలనుకుంటే, అప్పుడు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. షేక్‌హ్యాండ్ ఇచ్చుకోవడం లేదంటే అప్పుడు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఆటగాళ్లపై దాదాగిరీ ప్రదర్శిస్తున్నట్లే అవుతుందన్నారు. అసలు మీరెందుకు ఆడుతున్నారు, ఒకవేళ పాకిస్థాన్‌తో ఆడకుంటే ఏమవుతుందని ఆయన ప్రశ్నించారు. పాకిస్థాన్‌తో ఆడడం వల్ల బెట్టింగ్‌లో వేల కోట్లు ఆర్జిస్తున్నారని, దీంట్లో సగం డబ్బు పాకిస్థాన్‌కు వెళ్తుందని, ఆ డబ్బు నేరుగా దావూద్ ఇబ్రహీం, మసూద్ అజార్‌కు వెళ్తుందని, దీని వల్ల ఉగ్రవాదం మళ్లీ బలపడుతుందని శివసేన ఎంపీ రౌత్ అన్నారు.